సేవల్లో ఆమె ఓ మాతృమూర్తి



ప్రత్యేక ప్రతిభావంతులతో భార్గవి

ఆకలేస్తే అడగలేరు.మానసిక వికలాంగుల పిల్లల సేవలో భార్గవి తన జన్మ సార్థకం చేసుకుంటోంది. సేవా దృక్పథంలో ఆమె స్థానిక సాయి గార్డెన్ సిటీలో ప్రత్యేక ప్రతిభావంతుల కోసం ఒక బడిని నిర్వహిస్తున్నారు. అందరికీ తల్లిలా సేవలందిస్తూ పేరు తెచ్చుకున్నారు. ప్రత్యేక ప్రతిభావంతులైన పిల్లల 2017లో ప్రత్యేక పాఠశాలను ప్రారంభించారు. ప్రస్తుతం ఈ పాఠశాలలో 20 మంది పిల్లలకు సేవలందిస్తోంది. ఇక్కడ పిల్లలకు వసతి, భోజనం ఉచితం. అంతేకాకుండా వారికి ఫిజియో థెరపి, స్పీచ్ థెరపితోపాటు ఆటల్లో శిక్షణ ఇస్తున్నారు. పలువురి ఆర్థిక సాయంతో పాఠశాలను నడుపుతున్నట్లు ఆమె చెప్పారు.



వారి బతుకుల్లో అక్షర దీప్తి..!


గాయత్రి

గంగవరం: దివ్యాంగుల బాగోగులు చూసుకోవాలంటే ఎంతో ఓపిక, సహనం, వారిని లాలించే హృదయం ఉండాలి. అలాంటి హృదయంతో గాయత్రి దివ్యాంగుల జీవితాలకో ఆశాదీపం అయ్యింది. దివ్యాంగులకు అందిస్తున్న సేవలతో తనకుంటూ గుర్తింపు తెచ్చుకుంది. సేవలకు గుర్తింపుగా అవార్డులు అందుకుంది. 1999 నుంచి 2023 వరకూ దాదాపు మండలంలోని నడింపల్లె వద్దనున్న రిమ్మర్స్ పాఠశాలలో బుద్ధిమాంద్యం పిల్లలకు సేవలు చేశారు. ఆమె సేవలను గుర్తించిన గత ప్రభుత్వాలు ప్రశంసిస్తూ ఆమెను అవార్డులతో సత్కరించాయి. ప్రస్తుతం ఆమె సొంతంగా »అక్షర« పేరుతో మానసిక వికలాంగుల వసతి గృహం ప్రారంభించారు. అందులో దాదాపు 30మంది మానసిక, వికలాంగ పిల్లలకు ఏడాదిగా సొంత ఖర్చులతోనే వారి ఆలనా పాలనా చూసుకుంటున్నారు. భవిష్యత్‌లో వృద్ధులకు కూడా వసతి గృహం ఏర్పాటు చేయాలనే ఆలోచన కూడా ఉందని ఆమె చెప్పారు.



మానసిక వికలాంగుల వసతి గృహంలోని పిల్లలతో గాయత్రి

క్లుప్తంగా

పెద్ద దేవరకు రండి సార్..!

- మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి కురబ నాయకుల ఆహ్వానం


మాజీ సీఎంకు ఆహ్వాన పత్రికను ఇస్తున్న కురబ నాయకులు, ఎమ్మెల్సీ భరత్

శాంతిపురం: కురబ కులస్తులు 12 ఏళ్లకోసారి కదిరిముత్తనపల్లెలో భారీ ఎత్తున నిర్వహించే పెద్ద దేవరకు రావాలని కోరుతూ ఉత్సవ నిర్వహకులు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ఆహ్వానించారు. శుక్రవారం తాడేపల్లెలో ఆయనను వారు ఎమ్మెల్సీ భరత్‌తో కలిసి ఆహ్వాన పత్రికను ఇచ్చారు. శ్రీసిద్దేశ్వరస్వామి, శ్రీబీరేశ్వరస్వామి, శ్రీబత్తేశ్వరస్వామి, శ్రీరేవణ సిద్దేశ్వరస్వామి, శ్రీ చెన్నకేశవస్వామికి ఈ నెల 10 నుంచి పెద్ద దేవర(బ్రహ్మోత్సవాలు)ను నిర్వహిస్తున్నట్టు వారు వివరించారు. 13, 14 తేదీల్లో జరిగే పూజల్లో ఏపీతో పాటు కర్ణాటక, తమిళనాడు నుంచి లక్షలాదిగా భక్తులు దేవరకు వస్తారని జగన్‌మోహన్‌రెడ్డికి తెలిపారు. మాజీ సీఎంను కలిసిన వారిలో ఉత్సవ కమిటీ సభ్యులు శ్రీరాములు, మంజునాథ్, సోము, జ్ఞానేంద్ర తదితరులు ఉన్నారు.

బాల్య వివాహాలు అనర్థదాయకం


విద్యార్థినులతో మాట్లాడుతున్న వైద్యాధికారి

బైరెడ్డిపల్లె: బాల్యవివాహాలు చేస్తే ఆరోగ్యానికి అనర్థదాయకమని తీర్థం పీహెచ్‌సీ వైద్యాధికారి పద్మావతి అన్నారు. తీర్థం జెడ్పీ హైస్కూల్లో శుక్రవారం విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చిన్నతనంలో వివాహాలు చేస్తే పుట్టబోయే బిడ్డతో పాటు తల్లికి కూడా ప్రమాదకరమన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి తెలియజేశారు. హెల్త్ ఎడ్యుకేటర్ కాంతమ్మ, హెచ్‌ఎం ప్రభాకర్‌రెడ్డి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పీహెచ్‌సీల తనిఖీ

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని కల్లూరు, పులిచెర్ల, ఎల్లంకివారిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను శుక్రవారం జిల్లా క్షయ, కుష్ఠు, ఎయిడ్స్ నివారణ అధికారి డాక్టర్ వెంకట ప్రసాద్ తనిఖీ చేశారు. రికార్డులు, కేసుల నమోదును ఆయన పరిశీలించారు. 2023-24 సంవత్సరానికి మండలంలోని మతుకువారిపల్లె, పోశంవారిపల్లె, నన్నూరువారిపల్లె పంచాయతీ హెల్త్, వెల్‌నెస్ సెంటర్లలో ఒక టీబీ కేసు కూడా నమోదు కాలేదని సిబ్బందిని ప్రశంసించారు. డాక్టర్లు జానకీరావు, ఎల్లయ్య, షమామ్, సూపర్‌వైజర్లు శారద, మూర్తి, లక్ష్మీపతి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌ఎస్‌కే ఇన్‌చార్జిలకు శిక్షణ

గంగవరం: మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో పని చేస్తున్న ఆర్‌ఎస్‌కే ఇన్‌చార్జిలకు డిజిటల్ టెక్నాలజీపై శుక్రవారం దండపల్లె రైతు సేవా కేంద్రంలో శిక్షణ ఇచ్చారు. స్మార్ట్ ఫోన్లు ఎలా ఉపయోగించాలి? వ్యవసాయంలో ఉపయోగించే ఎస్‌పీఎస్‌ఎస్, వ్యవసాయ సంబంధిత యాప్‌లు ఎలా వాడాలి? డిజిటల్ చెల్లింపులు ఎలా చేయాలి?యూట్యూబ్‌లో వ్యవసాయానికి ఉపయోగపడే ఛానెల్స్ గురించి ఆర్‌ఎస్‌కే సిబ్బందికి వివరించారు. ఏఓ హేమలత, టెక్నికల్ ఏఓ దీప పాల్గొన్నారు.

రైతులకు శిక్షణ

గుడుపల్లె: వేసవి కాలంలో ఎండలు ఎక్కువగా ఉండడంతో వాతవరణానికి అనుకూలంగా పంటలు సాగు చేయాలని వ్యవసాయాధికారి నాగరాజు అన్నారు. శుక్రవారం మండలంలోని కనమనపల్లెలో రైతులకు స్కిల్ ఆఫ్ డిజిటల్ ట్రైనింగ్ కార్యక్రమం నిర్వహించారు. వివిధ అంశాలపై ఆయన అవగాహన కల్పించారు.

టౌనుకొచ్చిన జింక..!

కుప్పం: అటవీ ప్రాంతం నుంచి జింక జనారణ్యంలోకి వచ్చింది. శుక్రవారం స్థానిక హెచ్‌పీ రోడ్డు, గుడుపల్లె రోడ్డులోని నివాస గృహాల వద్ద జింక సంచరించింది. గురయ్యారు. దానిని చూసేందుకు గుమిగూడిన జన సమూహం చూసి జింక పరుగులు తీసింది. సమాచారం అందుకున్న అటవీ శాఖాధికారులు ఆ జింకను పట్టుకుని సురక్షితంగా అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు.


జింకను అటవీ ప్రాంతానికి తీసుకెళ్తున్న దృశ్యం

బహుముఖ ప్రజ్ఞాశాలి

- కూచిపూడిలో విశేష ప్రతిభ
- నృత్య కేంద్రంతో ఎందరికో శిక్షణ
- ఎన్నో అవార్డులు, ప్రశంసలు



మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న రజిని (ఫైల్), భజన రజిని

గంగవరం: ఆమెకు నృత్యం అంటే ఎనలేని ఇష్టం. ఆ ఇష్టం కొద్దీ పట్టుదల, కృషితో కూచిపూడి నేర్చుకుంది. దేశవ్యాప్తంగా తన నృత్య ప్రదర్శనలతో మంచి కళాకారిణిగా గుర్తింపు పొందింది. నాట్యంలో శిక్షణ ఇస్తూ మరెందరినో ఎందరినో కళాకారులుగా తీర్చిదిద్దింది. అంతేకాకుండా యోగాలో సైతం నిష్ణాతురాలు. కేరళ రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన యుద్ధవిద్యను సైతం నేర్చుకుని మహిళా శక్తిని చాటుతున్నారు. ఎన్నో అవార్డులు, ప్రశంసలు సైతం అందుకుని మహిళలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారు. ఆమె ఎవరో కాదు; స్థానిక సాయి మహాలక్ష్మి లేఔట్‌లో నివాసం ఉంటున్న డాక్టర్. రాజశేఖర్ సతీమణి డాక్టర్ భజన రజిని.

పురస్కారాలు

మహిళా ఫిజియోథెరఫీ విభాగం చిత్తూరు జిల్లా కో-ఆర్డినేటర్‌గా కొనసాగుతూ 2021లో రాష్ట్రంలో మిసెస్ ఇండియా మొదటి రన్నరప్, మిసెస్ మల్టీ ట్యాలెంటెడ్‌గా గెలిచారు. అలాగే యోగా ప్రపంచ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో రెండు ప్రపంచ రికార్డులు సాధించారు. నాట్యంలో అన్నామలై యూనివర్సిటీ నుంచి నట్టువాంగ కళామణి పురస్కారాన్ని అందుకున్నారు. అలాగే వివిధ సంస్థల నుంచి నాట్య మయూరి, గరుడ అవార్డు, నాట్య నవరత్న, నాట్య దీపం పురస్కారాలతోపాటు నాట్య రంగంలో చేస్తున్న సేవలకు చెన్నై జీఎస్ ఫైన్ ఆర్ట్స్ అకాడమి, జాయినింగ్ ద డాట్స్, తెలుగు భాషా పరిరక్షణ సమితి, పలమనేరు పరిరక్షణ సమితి తదితర సంస్థల నుంచి సత్కారాలు, అవార్డులు అందుకున్నారు.

దంపతులిద్దరూ ఘనాపాటీలే..!

తన భర్తతో కలిసి డాక్టర్ భజన రజిని పిల్లలకు ఆన్‌లైన్ యోగా క్లాసులు నిర్వహిస్తున్నారు. అలాగే సిరి కూచిపూడి నాట్యాలయాన్ని స్థాపించి ఎందరో విద్యార్థులకు నృత్య శిక్షణ ఇస్తున్నారు. విదేశాల్లోని పిల్లలకు సైతం నాట్యంలో ఆన్‌లైన్‌లో శిక్షణ ఇస్తున్నారు. విభిన్న రంగాల్లో రాణిస్తూ శభాష్ అనిపించుకుంటున్నారు. స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారు.

అధైర్య పడకండి... అండగా ఉంటాం

- వైఎస్సార్‌సీపీ నేత షరీఫ్‌కు ఎమ్మెల్యే భరోసా


ఫకృద్దీన్ షరీఫ్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రామచంద్రారెడ్డి, మాజీ ఎంపీ రెడ్డెప్ప

పుంగనూరు: వైఎస్సార్‌సీపీ సీమ జిల్లాల మైనారిటీ సెల్ కన్వీనర్ ఫకృద్దీన్ షరీఫ్‌ను పుంగనూరు ఎమ్మెల్యే డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శుక్రవారం పరామర్శించారు. రెండు రోజుల క్రితం గుండెపోటుకు గురైన షరీఫ్ మదనపల్లె ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇది తెలుసుకున్న ఎమ్మెల్యే, మాజీ ఎంపీ రెడ్డెప్ప ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. అధైర్య పడవద్దని, అండగా ఉంటామని, మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు వెళ్లాలని పెద్దిరెడ్డి సూచించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ మదనపల్లె ఇన్‌చార్జ్ నిస్సార్ అహమ్మద్, మాజీ ఎమ్మెల్యే దేశాయ్ తిప్పారెడ్డి, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శులు బైరెడ్డిపల్లి కృష్ణమూర్తి, నాగభూషణం, జింకా వెంకటాచలపతి, యూత్ నాయకులు రాజేష్, ఖాదర్, జవహర్ తదితరులు పాల్గొన్నారు.

పూజలు.. ఆశీస్సులు.. పరామర్శలు

మండలంలోని కీలకిరి, కోటగడ్డలోని నూతన రామాలయాల్లో శుక్రవారం పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పూజలు చేశారు. అలాగే మండలంలో వివాహమైన కొండసముద్రంలోని వైఎస్సార్‌సీపీ బీసీ నాయకుడు సుబ్బన్న కుమార్తె,ఆమె భర్తను ఆశీర్వదించారు. గత వారం సతీ వియోగానికి గురైన మేలుందొడ్డి సర్పంచ్ రాజారెడ్డి ఇంటికి వెళ్లి పరామర్శించారు. మాజీ ఎంపీ, మున్సిపల్ చైర్మన్, పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, మాజీ ఏఎంసీ చైర్మన్ అమరనాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులు, వక్ఫ్‌బోర్డు మాజీ చైర్మన్ అమ్ము, పార్టీ నాయకులు జయరామిరెడ్డి, రామకృష్ణారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, రాజశేఖర్, రాజేష్, నరేష్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

పోస్ట్‌మన్ దంపతులకు ఎమ్మెల్యే సత్కారం



చౌడేపల్లె: చౌడేపల్లె పోస్టుమన్ కృష్ణమూర్తి సుమారు 44 ఏళ్ల పాటు అందించిన సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. చౌడేపల్లెలో ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన కృష్ణమూర్తి నివాసంలో శుక్రవారం చిత్తూరు మాజీ ఎంపీ ఎన్.రెడ్డెప్పతో కలిసి ఆ దంపతులకు పెద్దిరెడ్డి సత్కరించి అభినందించారు. అనంతరం ప్రజలతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, జెడ్పీటీసీ దామోదరరాజు, మాజీ ఎంపీపీలు అంజిబాబు, రుక్మిణమ్మ, వైస్ ఎంపీపీ నరసింహులు యాదవ్, సింగిల్‌విండో మాజీ చైర్మన్ రవిచంద్రారెడ్డి పలువురు నాయకులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదం

పుంగనూరు: పట్టణ సమీపంలో రాగానిపల్లె రోడ్డులోని రెడ్డిభాస్కర్‌కు చెందిన నీలగిరితోట శుక్రవారం మంటలు రేగాయి. సమాచార అందుకున్న ఫైర్ ఆఫీసర్ సుబ్బరాజు తన సిబ్బంది సురేష్ బాబు, సుబ్రమణ్యం, వినోద్‌కుమార్, మోహన్ బాబు అక్కడికి వెళ్లి మంటలను ఆర్పా రు.

నారీ.. విజయభేరి

పలమనేరు: వివిధ రంగాల్లో మహిళలు సత్తా చాటుతున్నారు. తమదైన శైలితో రాణిస్తూ అవార్డులు, ప్రశంసలు అందుకున్న వారిపై కథనం

సెలవులు పెట్టని టీచర్


టీచర్ జయలక్ష్మి

పలమనేరు మండలంలోని సాకేవూరుకు చెందిన టీచర్ జయలక్ష్మి 2019 నుంచి ఇప్పటి వరకూ సెలవులు పెట్టకుండా రికార్డు సృష్టించారు. పిల్లల భవిత కోసం నిబద్ధతతో పనిచేస్తోంది. తన సేవలకు ఆమె ఇప్పటి వరకూ ఐదు అవార్డులు అందుకున్నారు. బడిలోని పిల్లలకు చదువుతోపాటు ఇతర కార్యక్రమాల్లో జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనేలా చేసి వారికి బహుమతులందేలా చూస్తోంది.

పిల్లల జీవితమే తన సర్వం


మాజీ ఉపరాష్ట్రపతి నుంచి అభినందనలు అందుకుంటూ..

గంగవరం మండలం నల్లగుట్లపల్లెకు చెందిన టీచర్ పుష్ప ప్రభుత్వ స్కూళ్ల పిల్లల భవితవ్యం కోసం అంకితభావంతో పనిచేస్తోంది. తెలుగు భాషాభివృద్ధి కోసం ఒక సంస్థలోనూ సేవలందిస్తోంది. తెలుగు భాషపై పిల్లలు పట్టు సాధించేందుకు సొంత నిధులతో కృషి చేస్తోంది. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా పురస్కారాలను అందుకుంది. తన సేవలకు గతంలో అప్పటి భారత ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు నుంచి సేవా పురస్కారం అందుకుంది.

బడికోసం సొంత నిధులు


పుష్పావతి

పట్టణంలోని బాలికోన్నత పాఠశాలలో ఫిజికల్ సైన్సు టీచర్‌గా పనిచేస్తున్న పుష్పావతి తన జీతంలో కొంత భాగాన్ని బడి అభివృద్ధి వెచ్చిస్తోంది. గతంలో ఈమె పనిచేసిన నూనేవారిపల్లె పాఠశాల ప్రహరీగోడ కోసం లక్ష రూపాయలను వెచ్చించింది. ఇప్పుడున్న బడిలోనూ పిల్లల కోసం ఎలాంటి మంచి జరగాలన్నా తన జీతం నుంచి ఇస్తూ ఆదర్శంగా నిలిచింది.

మహిళలు అన్నింటా రాణించాలి



బైరెడ్డిపల్లె: మహిళలు అన్ని రంగాల్లో సత్తా చాటాలని ఎంఈఓ సుబ్రమణ్యం పిలుపునిచ్చారు. మహిళా దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం మండలంలోని నెల్లిపట్ల జెడ్పీ హైస్కూల్లో ఉపాధ్యాయినులను ఘనంగా సత్కరించి ఆయన మాట్లాడారు. సమాజంలో మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, అధైర్యపడకుండా పనిచేసినప్పుడే విజయం సాధించవచ్చన్నారు.

మహిళా శక్తికి సాటి మరొకటి లేదు


ఎస్‌ఐను సత్కరిస్తున్న అధికారులు

పలమనేరు: మహిళా శక్తికి సాటి మరొకటి లేదని పలమనేరు ఏరియా ఆస్పత్రి ఆర్‌ఎంఓ డాక్టర్ శారద అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ముందస్తుగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సమాజంలో అన్ని రంగాల్లో మహిళలు దూసుకెళ్తున్నారన్నారు. లింగ వివక్షకు తావివ్వకుండా ఉన్నప్పుడే మహిళలు మరింత ముందుకెళ్తారన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ స్వర్ణతేజను సత్కరించారు. ప్రిన్సిపాల్ వెంకటేశులు, మహిళా సాధికారిక విభాగం కో-ఆర్డినేటర్ శశికళ, ఐక్యూ కో-ఆర్డినేటర్ బేనేజీర్, విద్యార్థినులు పాల్గొన్నారు.

ముందస్తుగా మహిళా దినోత్సవం


డిగ్రీ కళాశాలలో..

పుంగనూరు: పట్టణంలోని శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ముందస్తుగా మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశేఖర్ మహిళా నాయకురాళ్ల గురించి వివరించారు. సమాజాభివృద్ధిలో మహిళలపాత్ర ఎంతో కీలకమని చెప్పారు. అనంతరం కేక్ కట్ చేసి, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణుల ధర్నా


ధర్నా చేస్తున్న నాయీ బ్రాహ్మణులు

పుంగనూరు: తమపై దాడి చేసి, మంగళ వాయిద్యాలు పగులగొట్టినా నిందితుడిపై పోలీసులు చర్యలు తీసుకోలేదని నిరసిస్తూ నాయీ బ్రాహ్మణులు ధర్నా చేసిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలు... పట్టణానికి చెందిన నాయీ బ్రాహ్మణుడు శంకరప్ప బృందం గురువారం మండలంలోని బుఱ్రావారిపల్లెలో వివాహ కార్యక్రమానికి వెళ్లింది. పెళ్లి జరుగుతుండగా చిన్నరెడ్డెప్ప అనే వ్యక్తి వచ్చి దుర్భాషలాడుతూ, శంకరప్ప బృందంపై దాడి, చేసి వాయిస్తున్న డ్రమ్ములను పగులగొట్టాడు. దీనిపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే కేసు నమోదు చేసి, నిందితుడిని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు హేమంత్, నాయీ బ్రాహ్మణులు పాల్గొన్నారు.

ఉపవాస దీక్షలతో ముస్లింల ప్రార్థనలు



పుంగనూరు: రంజాన్ పండుగ ఉపవాస దీక్షల్లో ఉన్న ముస్లిలు తొలి శుక్రవారం అన్ని మసీదుల్లోనూ ప్రార్థనలు చేశారు. రంజాన్ పండుగను పురస్కరించుకుని 30 రోజుల పాటు ముస్లింలు కఠోరదీక్షలో ఉంటారు. ఈనెల 2న ప్రారంభమైన దీక్షలు 30వ తేదీతో ముగుస్తాయి. 31న రంజాన్ పండుగ జరుపుకుంటారు..సాయంత్రం దీక్షల సమయం ముగిసిన అనంతరం పలువురు మసీదుల వద్ద ఖర్జూరాలు, రొట్టెలు పంపిణీ చేశారు. అలాగే అన్నదానం కూడా చేశారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత



పులిచెర్ల(కల్లూరు): పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతని జిల్లా పంచాయతీ రిసోర్స్ సెంటర్ సమన్వయ షణ్ముగం అన్నారు. శుక్రవారం కల్లూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులతో కల్లూరులో పారిశుధ్యంపై ఆయన అవగాహన ర్యాలీ, మానవహారం నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో హెచ్‌ఎం శ్రీవాణి ప్రతిజ్ఞ చేయించారు. టీచర్లు వనపర్తి సిద్ధులు, రాజేంద్ర, వేణుగోపాల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నల్లగుండ్రాయస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

బైరెడ్డిపల్లె: మండలంలో కడపనత్తంలోని స్వయంభు శీ అలివేలుమంగమ్మ పద్మావతి సమేత శ్రీ నల్లగుండ్రాయస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం అంగరంగవైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం స్వామి వారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, సాయంత్రం అంకురార్పణ, ధ్వజారోహణం నిర్వహించారు. ఉభయదారులుగా తులసికుమార్, ప్రకాష్, రమేష్, మహేంద్ర, నాగరాజు వ్యవహరించారు. ఆలయ అర్చకులు రామక్రిష్ణమాచార్యులు భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

వారపు సంతలో అధికారుల దాడులు

సాక్షి ఎఫెక్ట్..


తనిఖీ చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

పలమనేరు: పట్టణంలో శుక్రవారం వారపు సంతలో స్థానిక మున్సిపల్ అధికారులు దాడులు చేశారు. సాక్షి దినపత్రికలో శుక్రవారం కల్తీ..కల్తీ శీర్షికతో ప్రచురించిన కథనంపై మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి స్పందించారు. ఆయన ఆదేశాలతో సిబ్బంది వారపు సంతలో దాడులు నిర్వహించారు. నాణ్యత లేని వస్తువుల విక్రయాలు, తూకాల్లో తేడాలు, ప్లాస్టిక్ కవర్లలో అమ్మకాలపై రూ.5,500 జరిమానా విధించారు.

పశువులకు టీకాలు

రొంపిచెర్ల: పాడి ఆవులకు రైతులు గాలి కుంటు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని మండల పశు వైద్యాధికారి శ్రీధర్ కోరారు. శుక్రవారం గానుగ చింత గ్రామ పంచాయతీలో టీకాలు వేశారు. ఆయన మాట్లాడుతూ, గాలి కుంటు వ్యాధి టీకాలను సంవత్సరంలో రెండుసార్లు వేయించాలన్నారు. ఈ వ్యాధి పాడి ఆవులకు సోకితే పాల ఉత్పత్తి తగ్గిపోవడం, చూలు నిలవకపోవడంతోపాటు వ్యాధి నిరోధక శక్తి పూర్తి తగ్గి పోతుందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని టీకాలు వేయించుకోవాలన్నారు. 4-8 నెలల వయస్సు కలిగిన పేయ దూడలకు బ్రూసెల్లోసిస్ వ్యాక్సిన్ వేయించాలన్నారు. పశు వైద్య సిబ్బంది ఇళ్లకు వచ్చి టీకాలు వేస్తారని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ కోరారు. గ్రామ పంచాయతీలో మొత్తం 678 పశువులకు గాను 320 పశువులకు టీకాలు వేసినట్లు ఆయన చెప్పారు.

ఆలయ ఆదాయానికి గండి కొడితే సహించం

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ ఆలయ ఆదాయానికి గండి కొడితే సహించేది లేదని టీడీపీ నాయకుడు, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ ఎస్‌కె.రమణారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. గత వేలంలో పాల్గొని వేలం హక్కులు పొందిన గుత్తేదారుల నుంచి ఇటీవల కొందరు కూటమి నాయకులు బలవంతంగా దౌర్జన్యంగా లాకున్నారని మండిపడ్డారు. మళ్లీ అధికారులు వేలం నిర్వహిస్తారని, టెండరుదారులు, వేలం పాటదారులు ధైర్యంగా పాల్గొనాలని కోరారు.

షూటింగ్‌బాల్ చాంపియన్‌కు సన్మానం



పలమనేరు: స్థానిక ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో స్పోర్ట్స్ కోచ్‌గా ఉన్న మహ్మద్ యూసఫ్ గత నెల నేపాల్‌లో జరిగిన ఏషియన్ షూటింగ్ బాల్‌లో చాంపియన్‌గా నిలవడంపై స్థానిక కళాశాలలో శుక్రవారం ఆయనకు ఘన సన్మానం చేశారు. ఫైనల్స్‌లో పాకిస్తాన్ ఆటగాడిని ఓడించి పలమనేరు పేరును దేశస్థాయిలో నిలబెట్టినందుకు ఆయన్ను ప్రశంసించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మహమూద్, అధ్యాపకులు పాల్గొన్నారు.